# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - ఖతార్ దేశాల మధ్య కీలక అంశాలకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదిరాయి.
- ❖ అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ జమ్మూ కాశ్మీర్‌లో నూతన నేర చట్టాల అమలుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్షా సమావేశం నిర్వహించారు.
- ❖ మహిళలలో క్యాన్సర్ చికిత్స కోసం వ్యాక్సిన్ ను అందుబాటులోకి తెస్తామని కేంద్ర సహాయ మంత్రి ప్రతాపరావు గణపత్రావ్ జాదవ్ వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23న ప్రసారం కానుంది.

========================

భారత్ - ఖతార్ దేశాలు న్యూఢిల్లీలో ఈ రోజు రెండు అవగాహన ఒప్పందాల పైన సంతకం చేశాయి. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంపొందించడం, రెట్టింపు పన్నులను నివారించడం, ఆదాయంపై పన్నుల భౌతిక ఎగవేతను నిరోధించడం వంటి వాటికి సంబంధించి ఒప్పందాలు కుదిరాయని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర సీనియర్ అధికారులు భారతదేశం వైపు నుండి హాజరయ్యారు. ఖతార్ మంత్రులు సీనియర్ అధికారులతో సహా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఈ రోజు ఉదయం రాష్ట్రపతి భవన్ లో ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ కి ఘన స్వాగతం లభించింది.

========================

దేశంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. దీనివల్ల ప్రజల జీవితాలలో మంచి మార్పు వచ్చిందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ - బేస్డ్ ల్యాండ్ సర్వే - నక్ష పైలట్ ప్రోగ్రామ్‌ను ఈ రోజు ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్ష కార్యక్రమం ఆస్తుల రికార్డుల సవరణకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం వాటర్‌షెడ్ యాత్రను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా పాల్గొన్నారు.

========================

మహిళల్లో క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం 5 నుంచి 6 నెలల వ్యవధిలో వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు గణపత్రావ్ జాదవ్ వెల్లడించారు. 9 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు దీనికి అర్హులు అవుతారని ఢిల్లీలో ఈ రోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. టీకాపై పరిశోధన దాదాపు పూర్తి అయిందని ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని అన్నారు. దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిందని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుందన్నారు. కాగా, 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆసుపత్రులలో పరీక్షలు నిర్వహిస్తామని.. వ్యాధిని ముందస్తుగా గుర్తించడానికి "డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు" ఏర్పాటు చేస్తామని కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మందులపై కస్టమ్స్ సుంకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన వెల్లడించారు.

========================

జమ్మూ కాశ్మీర్‌లో నూతన నేర చట్టాల అమలుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లో పోలీసులు, జైళ్లు, ప్రాసిక్యూషన్ ఫోరెన్సిక్‌లకు సంబంధించిన వివిధ కొత్త నిబంధనల అమలు, ప్రస్తుత స్థితిని సమీక్షించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నూతన నేర చట్టాలపై జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

=======================

అభివృద్ధి అంశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు  కలిసి పని చేయాలని కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి వి.సోమన్న అన్నారు. 2025-26 కేంద్ర బడ్జెట్‌పై కేరళలోని తిరువనంతపురంలో ఈ రోజు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...  దేశంలోని మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌ను  రూపొందించామని తెలిపారు. ప్రతి ఒక్కరి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్ ను తీర్చిదిద్దామని అన్నారు. గత 10 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా రైల్వే రంగంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందన్నారు.

=======================

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) ఈ రోజుతో 9 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో 2016లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరించడాన్ని ప్రోత్సహిస్తూ.. రైతుల ఆదాయాలను స్థిరీకరించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. పథకం విజయాన్ని గుర్తించిన తర్వాత కేంద్ర మంత్రివర్గం 2025-26 వరకు 69 వేల 515 కోట్ల రూపాయలకు పైగా బడ్జెట్‌తో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను పునర్వ్యవస్థీకరించింది. అదే విధంగా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం  ఆమోదం తెలిపింది.

=======================

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంగా మహాకుంభమేళాకు రోజు రోజుకూ భక్తుల తాకిడి పేరుగుతోంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ రోజు సాయంత్రానికి దాదాపు 55 కోట్ల మందికి పైగా భక్తులు గంగా, యమునా, సరస్వతి త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 26వ తేదీ నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఊహించని రీతిలో భక్తులు తరలివస్తున్నారని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మానవ చరిత్రలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక తీర్థయాత్రగా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

=======================

యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి రిషి సునక్ తన సతీమణి అక్షతా మూర్తితో కలిసి ఢిల్లీలోని పార్లమెంట్ భవనాన్ని ఈ రోజు  సందర్శించారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి కూడా ఉన్నారు. లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సునక్ కుటుంబానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి. మోడీ కూడా పాల్గొన్నారు.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్  75 వేల 997 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 75 వేల 967 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 14 పాయింట్లు నష్టంతో 22 వేల 945 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.96 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.84 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 925.20 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

=======================

శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. గ్రీన్ మెట్రో సిస్టమ్స్‌పై న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 5వ అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షత వహించిన కేంద్ర మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ... పెరిగిపోతున్న భూతాపం, కర్బన ఉద్గారాలు, వాయు కాలుష్యం వంటి సమస్యలను పరిష్కరించడానికి సౌరశక్తిని ఎక్కువగా ఉపయోగించాలని కోరారు.

========================

========================